

# అమ్మకడుపు చల్లగా...

## – గొల్లపూడి మారుతీరావు



### (గత సంచిక తరువాయి)

**మళ్ళీ కాస్త వెనక్కి వెళ్తే** – హైస్కూల్ గడిచాక ఎ.వి.ఎన్ కాలేజీలో చదువు. చేరేనాటికి పార్ధసారధిగారు ప్రిన్సిపాల్. తర్వాత ప్రముఖ పండితులు, సాహితీవేత్త దివాకర్ల రామ్మూర్తిగారు ప్రిన్సిపాలయారు. ఆ రోజుల్లో ఇదే కాలేజీలో చదివిన నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి.రామన్ ఉపన్యాసం ఒక్కటే ఆ రెండేళ్ళ జీవితానికి గుర్తుగా నిల్చింది.

రెండు నెలలు లెక్కల బియ్యేలో చేరాక విశ్వవిద్యాలయం వేపు మనస్సు లాగింది. కారణం అక్కడి రంగస్థలం కావచ్చు. ఏమయినా నా అదృష్టం – మా నాన్నగారు అంగీకరించారు. ఓ రోజు ఇద్దరం బయలుదేరాం. ఏ విభాగంలో సీట్లున్నాయి? బియస్సీ ఆనర్స్ లెక్కలు సరిగ్గా చెప్పాలంటే మాథమేటికల్ ఫిజిక్స్. ప్రొఫెసర్ మీనాక్షి సుందరం గారింటికి బయలుదేరాం. అప్పుడాయన పక్కనే మరొకాయన కూర్చుని ఉన్నారు. ఆయన కె.ఆర్.శ్రీనివాస అయ్యంగార్. ఇంగ్లీషు విభాగం అధ్యక్షులు. ఇద్దరూ తమిళులు. నా మార్కులు చూసి ఇద్దరు తమతమ విభాగాల్లో సీటు ఇస్తామన్నారు. అప్పుడు తీసుకున్న నిర్ణయం లేదా సరిగా తీసుకోలేని నిర్ణయం యిప్పటికీ నన్ను బాధపెడుతూంటుంది. మనస్సుని కించపరుస్తుంది. తెలుగు రచయితని కావాలనే లక్ష్యానికి ఇంగ్లీషు సాహిత్యం చదువు ఆటంకం అవుతుందన్న తప్పుడు ఆలోచన ఆనాటిది. నిజానికి ఉపకారి కాగలదన్న సలహా ఇచ్చేవారెవరూ నాకు లేకపోయారు. మా నాన్నగారు ఎంపిక నాకే వదిలేశారు. లెక్కల విభాగాన్ని ఎంచుకున్నాను.

అయితే ఆనర్స్ చదివు నాటకాలవల్లా, సాహితీ వ్యాసంగం వల్లా కుంటుపడినా మాథమేటికల్ ఫిజిక్స్ చదువు పరోక్షంగా నా ఆలోచనా సరళిని సానబెట్టింది. "మాథమాటిక్స్ మేక్స్ ఎ రెడీ మాన్" అన్నాడు ప్రముఖ వ్యాసకర్త బేకన్. ఇది నాకు లెక్కలు పెట్టిన భిక్ష. ఏ ఆలోచననయినా సాధికారికంగా, సోదాహరణంగా, తూకం వేసినట్టు ఆలోచించే శిక్షణని లెక్కలూ శాస్త్ర అధ్యయనం పరోక్షంగా కలగజేశాయి. కథా రచనలో సినిమా చర్చల్లో ఆలోచనతోపాటు, ఆ ఆలోచన పూర్వాపరాలను నిర్దుష్టంగా చెప్పగల సామర్ధ్యం నా చదువుదే అంటాను. స్క్రీన్‌ప్లేని ఆచితూచి రూపొందించడం,

దాని వెనకగల హృదయాన్ని అంతే నిర్దుష్టంగా చెప్పగలగడం సరిగ్గా అబ్బకపోయినా 'అలవాటుని' మిగిల్చిన చదువు వరం.

ఇంగ్లీషు విభాగంలో చేరలేదన్నమాటేగాని తర్వాతి మూడు సంవత్సరాలూ నిజానికి జీవితమంతా ఆంగ్ల సాహిత్య పఠనమూ, అభ్యాసంతోనే గడిచింది. ప్రీస్ట్లీ, గాల్స్‌వర్దీ, సోమర్సెట్ మాం, షా, ఓనీల్, డికెన్స్ విక్టర్ హ్యూగో, థామస్ హార్డీ, క్రిస్టొఫర్ ఫ్రై – యిలాగ.

ఆ రోజుల్లో చదివిన పుస్తకాల మీద నా సమీక్ష వేరేగా వ్రాసుకునేవాడిని. నా డైరీల్లో చదివి నవ్వుకోగలిగిన ఓ సమీక్ష కనిపించింది. అది విశ్వనాథవారి 'చెలియలి కట్ట' నవల మీద నేను వ్రాసుకున్నది. అప్పటి నా వయస్సు పదిహేడు. "పాత్రీకరణ అంతగా బాగోలేదు. సరి అయిన అంచీలలో పాత్రల వ్యక్తిత్వాన్ని ప్రదర్శించలేదు కవి. కథ ప్రయత్న పూర్వకంగా పెంచినట్టు ఉంది. అది వాస్తవికత చాలా పాత్రల్లో కనిపిస్తోంది. ట్రీట్‌మెంట్ బాగోలేకపోవడం చేత. థీం కొత్తది. మంచిది. చక్కని నవల వ్రాయడానికి అవకాశం ఉన్న థీం. అయినా ఏదో నీతిని వడబోయడానికి ప్రయత్నించాడు. మొత్తం మీద ఆయన సఫలులయారనవచ్చు."

ఒక కవి సామ్రాట్టు మీద పిల్లకాకి దూసిన ఉండేలు దెబ్బ యిది. ఏమయినా ఆయన రచన మీద నా నిరంకుశమయిన తీర్పు – ఓ డైరీ పేజీల్లోది – అర్ధ శతాబ్దం తర్వాత యిలా వీధిన పడుతుందని ఆ రోజుల్లో ఆ కుర్రాడు కలగని ఉండడు.

కాలేజీ రోజుల్లోనే పద్య సాహిత్యం మీదకి కూడా మనస్సు మళ్ళింది. ఏ.వీ.ఎన్. కాలేజీ లైబ్రరీలో అందమైన ఊర్వశి బొమ్మని పెన్నుతో వేసిన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి 'కృష్ణపక్షం' పుస్తకం మంచి గుర్తు. అందులో 'ప్రవాసం', 'ఊర్వశి' కూడా ఉండేవి. ఇవి కాక వేదుల సత్యనారాయణ శాస్త్రిగారి 'దీపావళి', ముద్దుకృష్ణ 'వైతాళికులు' సంకలనం, దువ్వూరి రామిరెడ్డి 'పానశాల' యిలాగ. మెల్లగా పద్య రచనకి ఉద్యమించాను.

1955 ఏప్రిల్ 25న శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి విశాఖపట్నం టౌనుహాలులో భారీ యెత్తున కనకాభిషేకం జరిగింది. కవితా సమితి నిర్వహించిన బృహత్తర కార్యక్రమానికి సన్మాన సంఘాధ్యక్షులు అంకితం వేంకట భానోజీరావుగారు. తెన్నేటి విశ్వనాథం పంతులుగారి చేతుల మీదుగా ఆ సన్మానం జరిగింది. ఆ సందర్భంలో 'మీరు పద్యాలు రాస్తారా గోమా?' అన్నారు ఆ సన్మాన సంఘం కార్యదర్శి పురిపండా అప్పలస్వామిగారు. (నన్ను గోమా అని పిలిచేవారు యిద్దరు పురిపండా, గుప్తా బ్రదర్స్ అధినేత రామ్మూర్తి గుప్తాగారు, ఆ తర్వాత దర్శకుడు, నిర్మాత అయిన మరొక మిత్రుడూ క్రాంతికుమార్. ఇందుకు కారణం రాజమండ్రి లలిత కళానికేతన్ ఫోటోలలో ఆయన పరిచయం)

వెంటనే రచనకి కూర్చున్నాను. పది పద్యాలు రాసిన గుర్తు. సభలో గడగడా చదివాను. వయస్సు విద్వత్తుతో ప్రమేయం లేకుండా సాహసాన్ని ఇస్తుంది. అనుభవం విద్వత్తుని కొలిచి పెద్దల పెద్దరికం ముందు తలవంచేటట్టు చేస్తుంది. అది ఓ యువకుడు పుంజుకుంటున్న ఉత్సాహానికి మాత్రమే గుర్తు. ఓ పద్యం జ్ఞాపకం వుంది.

ముద్దుల మూటగట్టెడి సమున్నత భావములొక్క చోటనే

ముద్దగ జేసి కూర్చితివి ముద్దుగ గద్దెము పద్దెముల్, సదా

నద్దితివేమొ మాధురుల నట్టిటు ద్రిప్పుచు నీర్ష్యతోడ నీ

పెద్దలు వెల్లబోవు చిటు పెప్పెపె మెమ్మెమె యంచు చూడగన్

మర్నాడు గుప్తా బ్రదర్స్‌లో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి నన్ను పరిచయం చేశారు పురిపండా ఆయన నవ్వుతూ పలకరించారు. ఆయన 'అనుభవాలూ – జ్ఞాపకాలూ 'లో కనకాభిషేకం ప్రస్తావన కూడా ఉంది – పురిపండాకు రాసిన ఆఖరి విల్లులో.

దాదాపు 35 సంవత్సరాల తర్వాత శ్రీపాద వారి రచనల మీద పరిశోధన చేసిన 'కనక్ ప్రవాసి' (డాక్టర్ చామర్తి కనకయ్యగారు) శ్రీపాదవారి కాగితాలలో ఈ పద్యాలు కనిపించాయంటూ నాకు పంపారు. ఆ తర్వాత మా అబ్బాయిపోయాక నా ఎలిజీ చదివి కరిగిపోతూ ఉత్తరం రాశారు.

హిందూ రీడింగ్ రూముకి ఎదురుగా ఉన్న గుప్తా బ్రదర్స్‌లోనే కలిశాను. పురిపండాకీ, రామంగారికీ శ్రీశ్రీ సన్నిహితులు. అప్పుడే శ్రీశ్రీ 'చరమరాత్రిని' ని గుప్తా బ్రదర్స్ ప్రచురించారు. నేను ప్రూఫ్‌లు కూడా చూసిన గుర్తు. ఆ షాపులో పుస్తకాలు ఇంటికి తెచ్చుకుని చదువుకునే సౌకర్యం నాకు రామంగారిచ్చారు. అక్కడే పురిపండాగారితో సమావేశాలు. అక్కడే శ్రీపాదవారినీ, ఆరుద్రగారినీ కలిశాను. ఆరోజుల్లోనే షాపు బోర్డు మీద తారసపడ్డ మరో రచన రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి 'అల్పజీవి'.

వయస్సు దృష్ట్యానూ, అప్పీల్ దృష్ట్యానూ ఆ వయస్సులో నన్ను ఆకర్షించిన ఇతివృత్తం – ఉమర్ ఖయ్యాం. నేను రాసిన పద్యం ఒకటి మచ్చుకి:

రమ్ము గతించుచున్నయది లక్ష్యము లేకనే కాలమిట్లు పై

గ్రమ్మగ వేచియున్నదిటు మృత్యువు; జీవిత పాత్రలోని స్రా

వమ్ము నిరర్థకమ్ముగనె వమ్మగుచున్నది చుక్కచుక్కగా

కొమ్మలనుండి యాకులటు కోర్కెలు రాలెను మెల్లమెల్లగా

ఇలాంటివెన్నో పద్యాలు ఇప్పటికీ అనర్గళంగా చదవగలను. అయితే ఇవెక్కడా ప్రచురితం కాలేదు. మా తెలుగు మాష్టారు వేదుల సుబ్బారావుగారు చూసి 'పద్యాలలో ధార వుందయ్యా' అన్నారు. ఏమయినా పద్యాలు 'కట్టడం' ఓ ప్రయత్నం. సాధన చేస్తే ఏం జరిగేదో ఎంత దూరం వెళ్ళేవాడినో. ఈలోగా అభిరుచీ, దృష్టీ కొత్త పుంతలు తొక్కింది. ఎన్నో కవితా గోష్ఠులలో ఈ పద్యాలు చదివేవాడిని. అలాంటి ఓ కవితాగోష్ఠి – అనకాపల్లి గౌరీ గ్రంథాలయ ఉత్సవాలలో చదివిన జ్ఞాపకం. నన్ను మెచ్చుకున్న వారిలో ఇద్దరు కవులు వసంతరావు వెంకటరావు. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగార్లు.

మరో రెండు కవితాగోష్ఠులు గుర్తున్నాయి. హిందూ రీడింగ్ రూములో సోమసుందర్, గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, మల్లాది రామచంద్రశాస్త్రి పాల్గొన్నారు. నేను ఉమర్ ఖయ్యాం పద్యాలు ధారాపాతంగా చదివాను. ఇప్పుడు పెద్దల ముందు బిడియం కాని ఆ రోజుల్లో ఉసికొల్పితే 'కీ' యిచ్చిన గ్రామఫోనులాగ మెడసారించేవాడిని. సోమసుందర్‌గారు 'సాఖీ కవి' అని పేరు పెట్టారు. మరొక గొప్ప సాహిత్యగోష్ఠి కాళోజీ అధ్యక్షతన యనమండ్ర ప్రసాదరావు, శివరావు, మసూనా, రాజకొండ విశ్వనాధశాస్త్రి, రెంటాల, చాగంటి సోమయాజులుగార్లు పాల్గొన్నారు.

ఓ యువ రచయిత మరిచిపోలేని మరో అద్భుతమయిన ప్రక్రియ – ఎ.వి.యన్ కాలేజీలో జరిగిన 'భువన విజయం' కార్యక్రమం. అందులో ఎం.ఆర్. అప్పారావుగారు శ్రీకృష్ణదేవరాయలు, మిగతా కవులు జమ్మలమడక మాధవరామశర్మ, శ్రీపద కృష్ణమూర్తి శాస్త్రి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, కర్రి వెంకట సుబ్బరాయశాస్త్రి, కె.వి.ఆర్ నరసింహం. మధునాపంతుల, అనంత పంతుల రామలింగస్వామి, గడియారం వేంకట శేషశాస్త్రి.

ఇక ఆంధ్రా యూనివర్శిటీ అభ్యుదయోత్సవాలలో నాలుగు ఉపన్యాసాలు చిరస్మరణీయాలు. ఇద్దరు తెలంగాణా కవులు వచ్చారు. ఒకాయన ఉంగరాల జుత్తూ, ఖంగుమనే గొంతుతో, అందమైన నగిషీ చెక్కిన మూర్తి పేరు సి.నారాయణరెడ్డి, మరొకయన ఉవ్వెత్తున లేచే కడలి తరంగం, ఆవేశం రూపుదాల్చిన మూర్తి పేరు దాశరధి. ఈ రెండుపేర్లూ నాకు కొత్త. మేం ఉత్తరాంధ్రలో వినని పేర్లు. ఆ సాయంకాలం ప్రేక్షకుల్లోంచి ఇద్దరు విద్యార్థులు లేచి దాశరథి కవిత 'అచుంబితం' పాడారు అద్భుతంగా.

"మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచిరా

నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నగ వలె విడిచిపో

చేదగు కన్నీటి బొట్టు చిందిన చప్పుడులు విను

వాదింపగరాని పరివాదిని లోతుగను.."

అందులో ఖంగుమన్న ఓ యువకుడి పేరు మోదుకూరి జాన్సన్. రెండో వ్యక్తి జి.భాను. జాన్సన్ చాలా సంవత్సరాలు గాయకుడుగానే గుర్తున్నాడు. తర్వాత ఉన్నట్టుండి 'నటనాలయం' వంటి ఉత్తమ నాటక రచయితగా, తనదయిన బాణీలో రచన చేసే సినీ రచయితగా తారసపడ్డాడు. నాకు 'ఒరేయ్' అని పిలుచుకునే అనుంగు మిత్రుడు.

మరొక సాయంకాలం ఉపన్యాసం – శ్రీశ్రీది. శ్రీ శ్రీ ఏనాడూ మంచి వక్తకాదు. వక్తృత్వం ఆయన స్ట్రాంగ్ పాయింట్ ఎప్పుడూ కాదు. ఆయన చెప్పింది కాక, ఆయన వచ్చినందుకు. ఆయన్ని వింటున్నందుకే పొంగిపోయిన సభాసదుల్ని చూశాను ఆ రోజునే. మరో ఉధృతమైన జలపాతం. విద్యార్థుల్ని కైపెక్కించే ఉపన్యాసం కె. వ్వెంకటేశ్వరరావుది. ఆయన పేరు అదే వినడం. ఆయన్నీ అదే వినడం. గంటన్నరపాటు తన్మయత్వంలో ముంచెత్తిన ప్రసంగమూ, ప్రదర్శనా అతనిది. రాబోయే కాలంలో ఒక జీవితకాలం పాటు ఈ పెద్దలందరితో నా సాహచర్యం సాగింది. మా అందరి మధ్యా ఎన్నెన్నో అనుభూతుల్నీ, అనుభవాలూ పెనవేసుకున్నాయి. ముఖ్యంగా ఆనాటి వెంకటేశ్వరరావు ఉపన్యాసం నటుడు, నాటక రచయితా కావాలనుకున్న ఓ యువకుడి కోరికని బలోపేతం చేశాయి.

అమెచ్యూర్ నాటక రంగం కూడా ఊహించలేని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో సాంకేతికమయిన సహాయాన్ని పూర్తిగా అందజేస్తూ, వ్యాపార నాటకరంగానికి ఏ మాత్రమూ తీసిపోని తీరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక రంగం నడిచేది. 'నడిచేది' అనడం తప్పు – కె.వి.గోపాలస్వామిగారు నడిపేవారు. చదువుకునే స్థాయిలోనే నాటకరంగం మీద సాధికారికమయిన రుచిని అలవాటు చేసి ఎన్నో తరాలను – ఉద్యోగాలలోకీ, జీవితంలోకీ పంపారు. నాలాంటి అదృష్టవంతులం ఆ 'రుచి'ని వృత్తిని చేసుకోగలిగాం.

జెఫ్రీ కెండాల్ వంటి వారు వ్యాపార నాటక రంగస్థాయిలో ప్రదర్శించడానికి కావలసిన అన్ని హంగులూ ఉన్న నాటకరంగం అది. ఆ తెరలూ, సైడు కర్టెన్లూ, మైకులూ, లైటింగూ, సైక్లోరమా అవన్నీ యితర నాటకరంగాలను పరిశోధించి సిద్ధం చేసినవి. మేకప్‌కు బ్రతికున్నంత కాలం విజయవాడనుంచి రామచంద్రరావు వచ్చేవాడు. మా నాటకాలన్నింటికీ అతనే మేకప్. విశ్వవిద్యాలయ రంగస్థలం మీద నాటకం వేసిన తర్వాత బయట నాటకం వెయ్యడం – డిగ్రీ చదువు ముగిశాక వీధిబడిలో కూర్చున్నట్టుండేది.

ఇక క్రమశిక్షణ 7.59 నిముషాలకు ఆరుబయలు రంగస్థల గేటు తలుపులు మూతపడేవి. 8 గంటలకి తెర లేచేది. ఒక్క నిముషం ఆలస్యమయినా రంగస్థలంలోకి ప్రవేశంలేదు. నటులకు కావలసిన పట్టుచీరలూ, ఏమయినా వస్తువులూ అతి సులువుగా గోపాలస్వామిగారింటి నుంచి వచ్చేవి. ఓసారి ఆయన కుటుంబమే రెండు నిమిషాలు ఆలస్యమయారు.

గేటు తలుపులు మూతపడ్డాయి. మూసేసిన విద్యార్థుల్ని అభినందించారు గోపాలస్వామిగారు.

ఆయన చేతికర్ర పట్టుకుని మఫ్లర్ వేసుకుని ప్రేక్షకుల మధ్యకి వస్తే నాటకానికి పెద్ద దిక్కు వచ్చినట్టూ, ఒక సాధికారికమయిన శాంక్షను దక్కినట్టు అనిపించేది. ఆయన సద్యస్ఫూర్తి అపూర్వం. అందులో కుర్రాళ్ళ స్థాయి చురుకూ, వగరూ ఉండేది.

ఓసారి ఏ మూలనుంచో అల్లరి కుర్రాడు "హే! భీమా" అని అరిచాడు. గోపాలస్వామిగారు కోపం తెచ్చుకోలేదు. ఆగి అటుచూసి "ఏమిరా ఘటోత్కచా! అంటే అర్థం కాలేదనుకుంటాను. ఏమిరా నా కొడకా!" అన్నారు.

విలక్షణమయిన ప్రతీ ప్రక్రియనీ సొంతం చేసుకోవాలనే ఆరాటం. ఉబలాటం ఎక్కువగా ఉన్న దశ అది. సాహితీ వ్యవసాయం క్రమంగా నాటకరంగం వేపు మొగ్గు చూపగా, ఆంధ్రా యూనివర్శిటీ చదువూ, ముఖ్యంగా రిజిష్ట్రారు కె.వి గోపాలస్వామిగారి ప్రోత్సాహం ఆ కోరికని పరిపుష్టం చేసి, ఆ వ్యాసంగానికి ఒక రూపునీ, ఒక స్థాయినీ తెచ్చిపెట్టాయి.

ఓ నాటక రచయిత జీవితానికి ప్రాణప్రతిష్ట జరిగిన రోజులవి.

3

నాలుగో యేట నుంచీ ఒకే లక్ష్యంతో తర్ఫీదు అవుతున్న వ్యక్తి వయసొచ్చాక 17,18 సంవత్సరాల నాటికి ప్రపంచాన్ని జయించగలడనడంలో నాకెలాంటి సందేహమూ లేదు. అందుకు నిదర్శనాలూ మన కళ్ళముందున్నాయి. ఒకావిడ బిడ్డ పుట్టినప్పటినుంచీ తన కూతురుని గొప్ప టెన్నీస్ క్రీడాకారిణిని చేయాలని కలలు కంది. అప్పటి గొప్ప క్రీడాకారిణి పేరు – మార్టినా నవ్రతిలోవా – తన కూతురుకి పెట్టుకుంది. ఆ అమ్మాయి మార్టినా హింగిస్. పసితనం నుంచీ రాకెట్ పట్టుకుని, నిద్రాహారాలు మాని సాధన చేసి 17యేళ్ళ వయస్సులో ప్రపంచాన్ని జయించింది. తల్లి కలని పండించింది. మరో రెండు గొప్ప ఉదాహరణలు – స్టెఫీ గ్రాఫ్. మారియా షరపోవా. ఏకాగ్రతా చిత్తశుద్ధి, శిక్షణ ఉంటే ఆ వయస్సులో రక్తం మిగతా పని చేస్తుంది. ఆవేశం, శక్తీ ఉరకలు వేసే వయస్సు అది. వెనక్కి తిరిగి చూడడమంటే ఏమిటో తెలియని దశ అది.

అయితే పైన చెప్పిన ముగ్గురికీ ఉన్న అదృష్టం నాకు లేదు. పెద్దల దృష్టిని దాటి, వారి విమర్శలకి తట్టుకుని, గుండెల్లో ఎగిసే అగ్నిపర్వతానికి రూపం కల్పించాలనే సవాలు నాది. ఆ రోజుల్లో కుటుంబంలోగానీ, సమాజంలోగానీ యిలాంటి కృషికి చేయూతనిచ్చే ఏర్పాట్లు లేవు. ఎవరికి వారు ఏర్పరచుకోవలసిన మార్గమే తప్ప. ఇలా చెప్తున్నప్పుడు పై ముగ్గురి ప్రతిభతో సామ్యాన్ని తీసుకురావడం నా ఉద్దేశం కాదు. ఆ దశలో వారికి దక్కిన చేయూత నాకు దక్కలేకపోయిందే అన్న బాధని వ్యక్తం చేయడానికే. తోడు నిలిచి, నా లక్ష్యాన్ని ఉద్బుద్ధం చేయగలిగితే నష్టపోయిన ఎంతో

వయస్సు కలిసి వచ్చేదే అని నా భావన.

తర్వాతి సంవత్సరాలలో దాదాపు చాలా నాటికలు ఒక్క రాత్రిలోనే రాశాను. కళ్ళు, ఆశయాలకు సంకెళ్ళు, రెండు రెళ్ళు ఆరు, ప్రశ్నలాంటివి. పూర్తి సినిమా నాలుగురోజుల్లో రాసేవాడిని. పూర్తి నవల కేవలం మూడు రాత్రులలో ముగించాను. 500 పేజీల పై చిలుకు అనువాదం (ది మేయర్ ఆఫ్ కాస్టర్ బ్రిడ్జి) ఏడు రోజుల్లో పూర్తి చేయగలిగాను. ఇలా చెప్పడం అప్పట్లో మనస్సులో, ఆలోచనల్లో  ఉన్న వేగాన్నీ, ఉధృతాన్నీ సూచించడానికి మాత్రమే. ఆ రచనల్లో పలుకునో, సత్తానో చర్చించడం నా ఉద్దేశం కాదు.

అది ఒక మైకం. ఎప్పుడు తెల్లవారుతుందా అని మనస్సు ఉరకలు వేసేది. దాదాపు 20 గంటలు చేతిలో పుస్తకమో, కలమో ఏదీ లేకపోతే సాహితి సమావేశమో, నాటకం రిహార్సల్సో, ప్రదర్శనో తప్పనిసరి. యూనివర్శిటీలో చదివిన మూడేళ్ళలో మనస్సు చదువు నుంచి పూర్తిగా పట్టాలు తప్పింది. తప్పిందన్న ఆలోచన కూడా లేదు.

ఆ రోజుల్లోనే నా మొదటి నాటిక 'శాఫో'ని విజయవాడ రేడియో కేంద్రం ప్రసారం చేసింది. అప్పట్లోనే అంతర్విశ్వవిద్యాలయ నాటిక రచనా పోటీలలో నా 'అనంతం' ఉత్తమ నాటిక బహుమతిని గెల్చుకుంది. ఆ రోజుల్లోనే 'రాఘవ కళానికేతన్' పేరిట నాటక సమాజాన్ని ప్రారంభించాను. రాత్రికి రాత్రి రచన, మర్నాడు రిహార్సల్స్ కేవలం పదిహేను, ఇరవైరూపాయల ఖర్చుతో ప్రదర్శన. ఇది 52 సంవత్సరాల క్రిందటి మాటని గుర్తుంచుకుంటే అప్పటి పదిహేను రూపాయల విలువ ఇప్పుడు వేలల్లో ఉండవచ్చు. విశాఖపట్నంలో టౌన్‌హాల్‌కి ఛార్జీ కేవలం ఒక్క రూపాయి. దానిని బట్టి పదిహేను రూపాయల విలువ ఊహించవచ్చు. ఊళ్ళో ఎక్కడ, ఎవరికి సాంస్కృతిక ప్రదర్శన కావాలన్నా ఒక్క మారుతీరావే తెలిసిన అడ్రస్సు. అప్పట్లో నిజమైన రిపర్టరీ ట్రూప్ నాదే.

విశాఖపట్నానికి తేలికగా 110 సంవత్సరాల నాటక చరిత్ర ఉంది. పంతొమ్మిదో శతాబ్ది ఉత్తరాంధ్రలో ధార్వాడ కంపెనీ నాటక సమాజం విశాఖపట్నంలో నాటకాలు వేసినప్పుడు ప్రభావితులైన పెద్దలు చాలా దశాబ్దాలు ఈ సమాజాల్ని నిర్వహించారు.

ప్రస్తుతం ఘోషా ఆసుపత్రి పక్కనే మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి ఆశ్రమం ఉండేది. ఆయన్ని కవిగారు అనేవారు. ఆయన నడిపిన కళాభిలాషక నాటక సమాజం ప్రసిద్ధమయింది. ఆ ఆశ్రమం ఇప్పుడు ఘోషా ఆసుపత్రిలో కలిసిపోయింది. వీరి నాటకాలు సి.బి.యం హైస్కూల్ ప్రాంతంలో వేసేవారట. వెలమవీధిలో ఇప్పుడు హార్బర్ పేట మొగిన – అంతకుముందు జగన్మిత్ర నాటక సమాజం నాటకాలు వేసేవారు. మెయిన్ రోడ్డులో 'గుడిసెన గుడి'లో ప్రదర్శనలు జరిగేవి. గన్నే వీధి (గన్నర్స్) మొగన హితకారిణీ సమాజం కార్యాలయం ఉండేది. ఇప్పటి గుప్తా బ్రదర్స్‌కి

తెలియకపోవచ్చుగాని ఆ రోజుల్లో వారి తాతగారు జగన్నాథ గుప్తాగారు (ఆయన నాకు తెలుసు) ఔరంగజేబు పాత్ర వేసేవారు.

1912 ప్రాంతంలో కవిగారు వేశ్యల్ని వృత్తి మానిపించి వారి ఉపాధికోసం ఒక నాటక సమాజాన్ని స్థాపించి సంగీతమానినీ సమాజం నాటకాలు వేయించేవారు. ఇది ఆనాటి స్థితిగతులు ఊహించగలవారికి అపూర్వమయిన సాంఘిక సంస్కరణ.

సెట్టి లక్ష్మీనరసింహం, పురిపండా కాదంబరి జగన్నాథరావు వంటి రచయితలు ఆనాటి నాటక సమాజాల్లో నటులూ, కార్యదర్శులూ. మరి అప్పటి నాటకాలు చంద్రహాస, మానవతీ చరిత్ర, మాలినీ విజయం, కంసవధ, విజయ విలాసం యిలాంటివి. కవిగారే 30 నాటకాలు రాశారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments